


ఐదుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లపై వేటు

పార్వతీపురం: ధాన్యం కొనుగోలులో చేతివాటం ప్రదర్శించిన ఐదుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లపై జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి వేటు వేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేంద్రాల్లో పని చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు చేతివాటం ప్రదర్శించి వాహనం అందుబాటులో లేనప్పటికీ ట్రక్ షీట్ జనరేషన్ చేయడం వల్ల ఇబ్బందులు తలెత్తాయి. జిఎల్టీతో చేసిన వాహనంతో కాకుండా అందుబాటులో లేని జిపిఎస్ వాహనంతో ట్రక్ షీట్స్ జనరేట్ చేయడం వల్ల అటు మిల్లర్ లాగిన్లో గాని , కస్టోడియన్ లాగిన్ లో గాని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం రైతులకు 24 గంటల లోపు ధాన్యానికి సంబందించి డబ్బులు జమ చేయాలనుకున్న విధానానికి దీని వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో గరుగుబిల్లి మండలం చినగుడబ, పార్వతీపురం మండలం పెదబొండపల్లి,డికె పట్నం, బల్జిపేట మండలం పలగర, మక్కువ మండలం వెంకటభైరిపురం డేటా ఎంట్రీ ఆపరేటర్ లను తొలగిస్తూ జెసి జారీ చేశారు.

వైద్య, ఆరోగ్యశాఖ మెడకు ఆశా కార్యకర్త డెత్



గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న మృతురాలి కుటుంబీకులు, దళిత సంఘాల నాయకులు

- వైద్యాధికారి, టిడిపి నాయకుల వేధింపుల వల్లే మృతి
- డిఆర్‌సిలో ప్రస్తావించిన ఎమ్మెల్యే బోనెల
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన మృతురాలి బంధువులు
- మంత్రి కాళ్లపై పడ్డా కనికరించలేదు : భర్త

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ మెడకు ఓ దళిత ఆశావర్కర్ మృతి వివాదం చుట్టుకుంటోంది. ఈ ఏడాది సెప్టెంబర్ 24న మక్కువ మండలం డి.శిర్లాం గ్రామానికి చెందిన ఆశావర్కర్ పొందూరు విద్యావతి మానసిక ఆవేదనతో గుండెపోటుకు గురై మృతి చెందారు. 2004 నుంచి ఆమె అదే గ్రామంలో ఆశావర్కర్‌గా పని చేస్తున్నారు. అయితే ఆశావర్కర్ పోస్టుపై కన్నేసిన స్థానిక టిడిపి నాయకుడు డి.గౌరునాయుడు మక్కువ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హరికృష్ణ సహకారంతో ఆ పోస్టును కొట్టేయాలని స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా విద్యావతి మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా లేరని, మంచమ్మీద నుంచి కదల్లేని పరిస్థితిలో ఉన్నారని గ్రామస్తులతో కలిసి టిడిపి నాయకుడు గౌరునాయుడు పిహెచ్‌సి వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఆశావర్కర్ విద్యావతిని నిలిపివేయడంతో ఆమె మండల టిడిపి నాయకులను, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని కలిసి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. విద్యావతి, ఆమె భర్త శ్రీనివాసరావు మంత్రి సంధ్యారాణి వద్దకు వెళ్లి ఆమె కాళ్లపై పడి బతిమలాడారు. అయినా ఆమె కనికరించకుండా స్థానిక టిడిపి నాయకుడు గౌరునాయుడుకే మద్దతుగా నిలబడ్డారు. ఆశావర్కర్ విద్యావతి ఆరోగ్యంగానే కనిపిస్తున్నా స్థానిక టిడిపి నాయకుడు కుట్రపూరితంగా పిహెచ్‌సి వైద్యాధికారికి ఫిర్యాదు అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ధీమాతో టిడిపి నాయకుడు చేసిన కుట్రలో వైద్యాధికారి కూడా పాత్రధారి అయ్యారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అయితే ఆశావర్కర్ విద్యావతి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి వెళ్లి ఫిట్‌నెస్ ధ్రువపత్రం పొందారు. తాను ఆశావర్కర్ పోస్ట్ నిర్వహించడానికి ఆరోగ్యంగా ఉన్నానంటూ ఫిట్ నెస్ సరిఫికెట్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి అందజేశారు. దీనిపై వెంటనే డిఎంహెచ్ఒ మక్కువ పిహెచ్ సి వైద్యాధికారికి లేఖ రాశారు. ఆశావర్కర్ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించారని, ఆమెను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశిస్తూ పిహెచ్‌సి వైద్యాధికారికి సిఫార్సు చేశారు. డిఎంహెచ్ఒ ఆదేశించినా స్థానిక టిడిపి నాయకుడి అండతో వైద్యాధికారి ఆ ఉత్తర్వులను అమలు చేయకుండా తొక్కిపెట్టేశారని విద్యావతి బంధువులు ఆరోపిస్తున్నారు. దీంతో తీవ్రమనస్థాపానికి గురైన ఆశావర్కర్ విద్యావతి ఈ ఏడాది సెప్టెంబర్ 24న గుండెపోటుతో మరణించారు. విద్యావతిని ఆశావర్కర్ పోస్ట్ నుంచి తప్పించిన తర్వాత తన సన్నిహితులను నియమించుకోవాలని పథకం రచించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో మృతురాలి బంధువులు, దళిత సంఘాల నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. విద్యావతిని కుట్రపూరితంగా ఆశావర్కర్ పోస్ట్ నుంచి టిడిపి నాయకుడు, వైద్యాధికారి తొలగించారని, ఆ మనోవేదనతోనే గుండెపోటుకు గురై మరణించిందని భర్త శ్రీనివాసరావు, కుమార్తె జోత్స్న కుమారి విలేకరులకు చెప్పారు. మంత్రి సంధ్యారాణి నివాసానికి వెళ్లి తాను ఆరోగ్యంగా ఉన్నానని, కుట్రపూరితంగా తొలగించేందుకు ప్రయత్నిస్తున్నా రని, తనకు న్యాయం చేయాలని ఆమె కాళ్లపై పడి బతిమిలాడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంత బతిమిలాడినా మంత్రి సంధ్యారాణి కనికరించ లేదని, దీంతో తీవ్ర ఆవేదనకు గురై తన భార్య గుండెపోటుతో మృతి చెందిందని చెప్పారు. విద్యావతి మరణానికి వైద్యాధికారి, టిడిపి నాయకుడు వేధింపులేనని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన కోరారు. దళిత మహిళను వేధింపులకు గురి చేసిన టిడిపి నాయకులు, వైద్యాధికారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు పులి డేవిడ్, మామిడి కృపారావు, బొద్దాన అప్పారావు డిమాండ్ చేశారు.

డిఆర్‌సిలో ప్రస్తావించిన ఎమ్మెల్యే బోనెల

ఆశావర్కర్ పొందూరు విద్యావతిని వైద్యాధికారులే మానసికంగా వేధింపులకు గురి చేసి హత్య చేశారని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఇటీవల జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో ప్రస్తావించారు. ఈ అంశంపై ఆయన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కరరావును నిలదీశారు. ఎమ్మెల్యే లేవనెత్తిన అంశాలపై డిఎంహెచ్ఒ సరైన సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన పరిస్థితి కనిపించింది. అయితే ఈ అంశం తన నియోజకవర్గం పరిధిలోకి వస్తుందని, దీంతో మీకేం సంబంధమని అక్కడే ఉన్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఎమ్మెల్యేతో వాదించినట్లు తెలుస్తోంది. మరణించిన ఆశావర్కర్ విద్యావతి దళిత మహిళ కావడంతో తాను ప్రస్తావించానని ఎమ్మెల్యే బదులిచ్చినట్లు సమాచారం. మొత్తమ్మీద ఆశావర్కర్ విద్యావతి మృతి వ్యవహారం చిలికి చిలికి గాలి వానలా వైద్య ఆరోగ్య శాఖ మెడకు చుట్టుకునే లా కనిపిస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

నిబంధనలు పాటించని మిల్లర్లపై చర్యలు

- ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ ఉక్కుపాదం
- అగ్నిమాపక భద్రతపై తీవ్ర ఆగ్రహం
- రైతుల అవగాహనకు తక్షణమే గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలని ఆదేశం

ప్రజాశక్తి - పార్వతీపురం

ధాన్యం కొనుగోళ్లు, మిల్లింగ్ ప్రక్రియలో నిబంధనలను పాటించని మిల్లర్లపై జిల్లా యంత్రాంగం కఠిన వైఖరిని అవలంబించింది. ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక భద్రతతో సహా కనీస ప్రాథమిక వసతులు, భద్రతా ప్రమాణాలు పాటించని మిల్లర్లను వెంటనే బ్లాక్లిస్ట్ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక భద్రత విషయంలో మిల్లర్ల నుంచి ఎటువంటి సానుకూల స్పందన లేకపోవడంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస నిబంధనలు పాటించకపోవడం పూర్తి నిర్లక్ష్యంగా పరిగణించబడుతుందని స్పష్టం చేశారు. రైతులను గౌరవించని వారిని ఎవర్నీ క్షమించేది లేదని గట్టిగా హెచ్చరించారు. నిబంధనలు పాటించని మిల్లులకు ఇప్పటి నుంచి ఎటువంటి వ్యాపారం రాకుండా నిరోధిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ తన ఆకస్మిక పర్యటన ఆధారంగా ఇప్పటికే రెండు మిల్లులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. బ్యాంకు గ్యారంటీ విషయంలో ఆలస్యంపై ఈ మధ్యాహ్నానికి పూర్తి నివేదిక కావాలని ఆయన అధికారులను కోరారు. కొనుగోలు ప్రక్రియపై రైతులకు సరైన అవగాహన లేకపోవడం వల్ల అపోహలకు లోనవుతున్నారని, దీనిపై తక్షణమే దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైస్ మిల్లు, రైతు భరోసా కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిబంధనలు, ఎస్ఒపి ప్రకారం తీసుకోవాల్సిన వివరాలతో కూడిన వాల్ పోస్టర్లను తప్పనిసరిగా అతికించాలని సూచించారు. గన్నీ బ్యాగులు ఇచ్చినందుకు సంబంధించిన డబ్బులు రైతు ఖాతాలో జమ అవుతాయన్న విషయాన్ని పిసిపి సిబ్బంది రైతులకు స్పష్టంగా తెలియజేయాలని, లేకుంటే రైతులు డబ్బులు మిల్లర్లే తీసుకుంటున్నారన్న తప్పుడు భ్రమలో ఉంటారని పేర్కొన్నారు. మిల్లులు, పీపీసీ సిబ్బంది, వ్యవసాయ అధికారులు, సివిల్ సప్లైస్ సిబ్బందితో కలిసి ప్రతి గ్రామంలో తక్షణమే ధాన్యం కొనుగోళ్లపై అవగాహన సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే విచారణ చేయాలని, కాల్ సెంటర్ ఓపెన్ చేసి ఒక నెంబర్ ఇవ్వాలన్నారు. రైతులకు ఇచ్చే బిల్లుల విషయంలో స్పష్టత పాటించాలని ఆదేశించారు. బాధ్యతారాహిత్యంగా ఉండి, సమావేశాలకు గైర్హాజరైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌రెడ్డి, సబ్ కలెక్టర్లు ఆర్. వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్, డి.ఎంసివిల్ సప్లై శ్రీనివాస్, డిఎస్ఒ బాల సరస్వతి, జిల్లా వ్యసాయాధికారి అన్నపూర్ణ, జిల్లాలో రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

గిరిజన సంక్షేమ టీచర్లకు జీతాలు చెల్లించాలి

ఐటిడిఎ వద్ద యుటిఎఫ్ నిరసన



ఐటిడిఎ వద్ద నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆశ్రమ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని కోరుతూ యుటిఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా శాఖ ఆధ్వర్యాన స్థానిక ఐటిడిఎ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ నిరసనను ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 8 అయినా ఇప్పటికీ వీరికి జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. జీతాల హెడ్ ఆఫ్ అకౌంట్ నెంబర్ల సరి చేయాలని చెప్పి తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు మాట్లాడుతూ సంక్రాంతి పండగ ముందు ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోవటం సరికాదని, మిగిలిన యాజమాన్యాల ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు చెల్లించకపోవడమేమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, జిల్లా కార్యదర్శులు ఎన్ శ్రీనివాసరావు, కె.గోవిందమ్మ, రాష్ట్ర కౌన్సిలర్ పి.బృందావనరాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ప్రయత్నాలు మానుకోవాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు



ఎంఇఒకు వినతిని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి - కురుపాం

స్మార్ట్ కిచెన్ పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, గిరిజన సంఘం నాయకుడు మండంగి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన నిర్వాహకులు, స్కూల్ స్వీపర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 156 ప్రభుత్వ పాఠశాలల్లో 22 ఏళ్లుగా కార్మికులు తక్కువ జీతాలతో, అప్పులు చేసి, అనారోగ్యాలను భరిస్తూ పిల్లలకు వేడి భోజనం అందిస్తున్నారని, ఇప్పుడు ఈ వంట విధానాన్ని రద్దు చేసి మండలంలో ఒకే స్మార్ట్ కిచెన్ ఏర్పాటు చేసి వాహనాల ద్వారా భోజనం పంపిణీ చేయాలనుకోవడం గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. ఒకే చోట వండి పంపడమనేది ప్రమాదకరమన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు సేవా దృక్పథంతో ఈ పథకం కొనసాగిస్తున్నప్పటికీ, వారికి కనీస వేతనాలు కూడా చెల్లించని ప్రభుత్వం ఇప్పుడు ఉపాధినే తొలగించడం మహిళలపై ద్రోహమని మండిపడ్డారు. సీపర్లకు గుర్తింపు కార్డులు, పనిముట్లు, పెండింగ్ జీతాలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఇఒ ఎన్.సత్యనారాయణకు వినతిని అందజేశారు. ధర్నాలో గిరిజన సంఘం నాయకులు సీతారాం, హరినాథ్, సంగం నాయుడు, సింహాచలం, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ సీపర్లు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు వినియోగించకపోవడంపై ఆగ్రహం



బిసి హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మహాత్మా జ్యోతి బాపులే బాలుర పాఠశాలను, బిసి వెల్ఫేర్ హాస్టల్‌ను రాష్ట్ర బిసి వెల్ఫేర్ సెక్రటరీ సత్య నారాయణ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బిసి హాస్టల్‌లో మరుగుదొడ్లు సద్వినియోగం కాకుండా విద్యార్థులు బయట స్నానాలు, లెట్రిన్‌కు వెళ్తుండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ సత్యనారాయణ మాట్లాడుతూ బిసి వెల్ఫేర్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేలా సిబ్బంది కృషి చేయాలని, విద్యార్థుల ఆరోగ్యం, మౌలిక వసతుల కోసం వాల్త్ యాప్ ద్వారా పర్యవేక్షణ కొనసాగుతుందని అన్నారు. స్థానిక బిసి హాస్టళ్లలో మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో వార్డెన్, కుక్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అయ్యరక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

అయ్యరక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్, డైరెక్టర్లను నియమించాలని జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డి.పారినాయుడు ఆధ్వర్యంలో కురుపాం పిఎసిఎస్ అధ్యక్షులు డొల్లు కిషోర్ కుమార్, తోటపల్లి దేవస్థానం చైర్మన్ మార్కొండ ఫకీరు నాయుడు బిసి వెల్ఫేర్ కమిషనర్ సత్యనారాయణకు వినతిని అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభివృద్ధికి అయ్యరక కార్పొరేషన్ ఏర్పాటు అత్యవసరమని, దీంతో వారికి ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు మరింత సమర్థవంతంగా చేరుతాయని అన్నారు. కార్యక్రమంలో మార్కొండ వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.



సెల్ టవర్ వద్దంటూ నిరసన తెలుపుతున్న మామిడిపల్లి గ్రామస్తులు

జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు

టవర్ నిర్మాణానికి వ్యతిరేకంగా బాధితుల ఆందోళన

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని మామిడిపల్లిలో జనావాసాల మధ్యలో ఎయిర్‌టెల్ సెల్ టవర్ నిర్మించడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక మహిళలు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. నివాస ప్రాంతాల మధ్య సెల్ టవర్‌ను ఏర్పాటు చేయొద్దని, దీనివల్ల చిన్న పిల్లల ఆరోగ్యంపై రేడియేషన్ ప్రభావం చూపుతుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మామిడిపల్లిలో మంగళ వీధికి చెందిన ప్రజలు మాట్లాడుతూ తాము నివసించే ప్రాంతంలో సెల్ టవర్ ఏర్పాటు చేస్తే రేడియేషన్ కారణంగా పిల్లలు, వృద్ధులు తీవ్రమైన అనారోగ్యాల పాలవుతారని ఆందోళన చెందారు. టవర్ ఎత్తు 120 అడుగులు ఉండడం, ఈ ప్రాంతంలో తరచుగా ఈదురు గాలులు వీయడం వల్ల టవర్ ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని, ఆకస్మాత్తుగా ఏదైనా ఇంటిపై పడితే తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సెల్ టవర్ నిర్మించడానికి సిద్ధమైన ప్రాంతానికి వెళ్లి కంపెనీ ప్రతినిధులను స్థానిక ప్రజలు అడ్డుకున్నారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రెవెన్యూ అధికారుల వద్ద నిరసన

కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి వచ్చిన స్థానిక రెవెన్యూ అధికారి పార్వతి వద్ద బాధిత మహిళలు నిరసన వ్యక్తం చేశారు. తాము నివసించే ప్రాంతంలో ఎట్టి పరిస్థితుల్లో సెల్ టవర్ నిర్మించొద్దని, అభివృద్ధికి తాము అడ్డుకామని, అయితే గ్రామానికి కొంచెం దూరంగా ప్రజలకు ఇబ్బందుల్లేకుండా టవర్ ఏర్పాటు చేసుకుంటే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. జనావాసాల మధ్య సెల్ టవర్‌ను ఏర్పాటు చేస్తామని కంపెనీ మొండిగా వ్యవహరిస్తే, ప్రతిఘటన తప్పదని స్థానికులు హెచ్చరించారు. చిన్న పిల్లలు, వృద్ధుల ఆరోగ్యానికి ముప్పు కలిగించే ఈ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. పనుల నాణ్యత విషయమై సంబంధిత ఐటిడిఎ ఇంజినీరింగ్ అధికారిని వివరణ కోరేందుకు 'ప్రజాశక్తి' ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

అర్జీల నాణ్యతపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

పిజిఆర్‌ఎస్ ద్వారా అందిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ డాక్టర్‌ఎన్.ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ వినతులను స్వీకరించి, వారి సమస్యలను సావధానంగా విని వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్‌తో పాటు అర్జీలను డిఆర్ఒ కె.హేమలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్ అర్జీలను ఆడిట్ చేయడం జరుగుతుందని, కావున జిల్లా అధికారులు వీటికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ పరిష్కరించాలని తెలిపారు. ఇందులో నాణ్యత బాగుండాలని, జిల్లా అధికారులు అర్జీలను స్వయంగా పర్యవేక్షించి వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. అర్జీలను పరిష్కరించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులపై ఉందన్నారు. నాణ్యతగా అర్జీలను పరిష్కరించకపోతే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమన్నారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత మరింత పెంచాలని, ఎటువంటి లోపాలు లేకుండా సరిదిద్దుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖ జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మొత్తంగా 82 ఫిర్యాదులు అందగా, వీటిలో 12రెవెన్యూ, కాగా, సాధారణ వినతులు 70 వరకు వచ్చాయి.

దివ్యాంగునికి టచ్ ఫోన్ అందజేసిన జిల్లా కలెక్టర్

గరుగుబిల్లికి చెందిన వికలాంగుడు ఎ.అఖిల్ తనకు టచ్ ఫోన్ మంజూరు చేయాలని కోరుతూ సోమవారం జరిగిన పిజిఆర్‌ఎస్‌లో జిల్లా కలెక్టరుకు వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి తక్షణమే స్పందించి, అర్జీదారుడు కోరినట్లుగా టచ్ ఫోన్ ను అందజేశారు.

ఐటిడిఎలో పిజిఆర్‌ఎస్

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో సోమవారం పిజిఆర్‌ఎస్‌కు 35 వినతులు వచ్చాయి. పిహెచ్ఒ ఎస్‌వి గణేష్ ఆధ్వర్యంలో ఫిర్యాదుదారుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఇఇ రమాదేవి డిప్యూటీ డిఇ రామ్మోహన్‌రావు, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానంద్ , ఎఒ వాహిని, పిహెచ్ఒ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ప్రజా సమస్య పరిష్కార వేదికకు 9 ఫిర్యాదులు

పార్వతీపురం టౌన్ : స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 9 మంది ఫిర్యాదుదారుల నుండి జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను పరిశీలించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే "ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఎం.వెంకటేశ్వర రావు, డిసిఆర్‌బి సిఐ ఆదాం, ఎస్సై రమేష్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశమైన కొటియా గ్రామాల గిరిజనులు

ఒడిశా పథకాలు తిరస్కరిద్దాం

7 కొటియా గ్రామాల గిరిజనుల తీర్మానం

సాలూరు: ఒడిశా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు తిరస్కరించాలని వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఏడు గ్రామాల ప్రజలు సోమవారం తీర్మానించారు. పట్టు చెన్నూరు, పగుల చెన్నూరు పంచాయతీల పరిధిలో గల ఏడు గ్రామాల గిరిజనులు సమావేశమై చర్చించారు. ఎపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనుల అమలుకు కొటియా గ్రామాల్లో పర్యటించేందుకు వస్తున్న అధికారులను ఒడిశా పోలీసులు, రెవెన్యూ అధికారులు అడ్డుకోవడం, దౌర్జన్యం చేయడం వంటి పరిణామాలు ఇటీవల తరచుగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏడు గ్రామాల గిరిజనులు ఇంకా నుంచి ఒడిశా పథకాలను తీసుకోకూడదని తీర్మానించారు. అదే విధంగా ఒడిశా అధికారులు ఏర్పాటు చేసిన నేమ్ బోర్డులను వారు తొలగించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గిరిజన విద్యార్థి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థి మండంగి అఖిల్ చంద్రదేవ్ హాకీ అండర్ -17 బాలబాలికల స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పిడి మాధవరావు తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో డిఎస్ఎ స్పోర్ట్స్ అకాడమీలో ఈనెల ఈనెల 9 నుంచి 11 వరకు జరుగుహాకీ క్రీడల్లో పాల్గొంటాడని తెలిపారు. రాష్ట్రస్థాయికి అఖిల్‌చంద్రదేవ్ ఎంపిక పట్ల హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, డిప్యూటీ వార్డెన్ అప్పారావు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు అభినందించారు.

ఫెన్సింగ్ అండర్ - 14 క్రీడలకు కొత్త గూడ విద్యార్థులు

ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి అండర్ -14 విభాగంలో బాలబాలికల పోటీలకు మండలంలోని కొత్తగూడ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులు బిడ్డిక హర్షవర్ధన్, బిడ్డిక అరవింద్, బిడ్డిక సిద్దార్థ్, ఆరిక సుధీర్ కుమార్, తాడంగి తనీష్, మండంగి ప్రదీప్ ఎంపికయ్యారు. నెల్లూరు జిల్లా రైన్‌బో ఉన్నత పాఠశాలలో ఈనెల 9 నుంచి 11 వరకు నిర్వహించే క్రీడల్లో పాల్గొంటారని పిడి మాధవరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం శ్రీనివాసరావు, డిప్యూటీ వార్డెన్ అప్పారావు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి పిఎసిఎస్ ఉద్యోగుల ధర్నా



బలిజిపేట పిఎసిఎస్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - పార్వతీపురం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి పిఎ సిఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన సోమవారం స్థానిక డిసిసిబి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి సత్యారావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర సంఘం గౌరవాధ్యక్షులు కెవిఎస్ రవికుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు ఆమోదించాలని డిమాండ్ చేశారు.62 ఏళ్లకు ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీ, జీవో 36 అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిసిసిబి, పిఎసిఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి అచ్చుత రావు పాల్గొన్నారు.

బలిజిపేట : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని మండలంలోని పలగర, గళావిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బలిజిపేట పిఎసిఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలగర పిఎసిఎస్‌లో పనిచేస్తున్న ఆరుగురు, గళావిల్లిలో పనిచేస్తున్న నలుగురు సభ్యులకు సుమారుగా 7నెలలుగా జీతాలందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 తర్వాత చేరిన వారిని పర్మినెంట్ చేసి, హెచ్‌ఆర్‌సి పాలసీ అమలు చేయాలని, సర్వీసులో ఉన్న సభ్యులు మరణిస్తే రూ.20 లక్షల బీమా ఇవ్వాలని, చట్ట ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62ఏళ్లకు పెంచాలని, రైతుకు రుణం ఇవ్వాలంటే సహకార బ్యాంకు ద్వారా కాకుండా తమ పిఎసిఎస్ ద్వారా ఇవ్వాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


సంగెడ్డ గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

గిరిజన గ్రామాల్లో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని బియ్యాలవలస, సంగెడ్డ, చెరుపుకొమ్మువలస పరిసర ప్రాంతాల్లో సోమవారం ఉదయం ఏనుగుల గుంపు సంచరించిందని రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఉదయం వేళ గ్రామాల్లోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు అరటి, పామాయిల్, వరి, పత్తి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. అటవీశాఖ అధికారులు అత్యవసర చర్యలు తీసుకొని ఏనుగుల తిరిగి అటవీ ప్రాంతాలకు తరలించి తమ పంటలు, ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. గత కొన్ని రోజులుగా ఏనుగుల సంచారం పెరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత తీవ్రతరం కానుందని వారు హెచ్చరిస్తున్నారు.

మంత్రి కారు డ్రైవర్‌పై ఎస్‌పికి ఫిర్యాదు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కారు డ్రైవర్ రౌతు హరికుమార్‌పై మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర పిఎ అధికార్ల నాగరాజు మరోసారి జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డికి సోమవారం గ్రీవెన్స్ సెల్ లో ఫిర్యాదు చేశారు. ఈనెల 3న సాలూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిఐ బి.అప్పలనాయుడుకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు కేసు నమోదు చేయలేదు. ఇటీవల మంత్రి సంధ్యారాణి కారు డ్రైవర్ తనను అసభ్యకరమైన, జుగుప్సాకరమైన పదజాలంతో వాట్సాప్ మెసేజ్‌లు గ్రూపుల్లో పెట్టారని, దీనివల్ల తాను మానసికంగా చాలా కృంగుబాటుకు గురయ్యానని పేర్కొంటూ పిఎ నాగరాజు ఫిర్యాదు చేశారు. మంత్రి సంధ్యారాణి కారు డ్రైవర్ రౌతు హరికుమార్‌పై కేసు నమోదు చేయకపోవడం తాత్కారం చేయడంతో పిఎ నాగరాజు ఎస్పీ మాధవరెడ్డికి ఫిర్యాదు చేశారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న మీసాల సాగర్ (చిట్టి) తన నిజాయితీని చాటుకున్నాడు. సోమవారం మూలిగూడ జంక్షన్ వద్ద దొరికిన ఒక మొబైల్ ఫోన్‌ను యజమానికి అందించేందుకు ప్రయత్నించిన సాగర్, పరిసరాల్లోని ప్రజలకు సమాచారమిచ్చాడు. ఈ సందర్భంగా దుడిలి గ్రామ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు శంకరరావు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఫోన్ జారిపోయింది. ఆ మొబైల్‌లో ఆధార్, ఎంఎం, ఇలా పాఠశాలకు సంబంధించిన చాలా యాప్‌లు ఉన్నాయని ఆటో డ్రైవర్‌కు దొరికిన మొబైల్‌ను తమకు అందజేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ (48) మంది గర్భిణులకు వైద్య తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎత్తు, బరువు, మధుమేహం, రక్తపోటు, హెచ్‌బి తదితర రకాలైన ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి సలహాలు, సూచనలు అందజేసి మందులు పంపిణీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు చిట్టిపుడి వలస శ్రీ సత్యసాయి అన్నపూర్ణ నిత్య సేవ కేంద్రం ద్వారా గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శాంతి కుమారి, సుభాషిణిమని, ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గంజిగెడ్డకు రోడ్డు వేయాలని వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండలంలోని తెలునాయుడువలస నుంచి గంజిగెడ్డ వరకు రోడ్డు వేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డోకిశీల పంచాయతీ తెలునాయుడువలస నుంచి గంజిగెడ్డ వరకు తారురోడ్డు 2016-17లో మంజూరైనా ఇంతవరకు పనులు పూర్తి కాలేదన్నారు. అలాగే డోకిశీల నుంచి గంగిగెడ్డ వరకు త్రీ ఫేస్ విద్యుత్ కోసం అప్పట్లో విజయనగరం జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసినా ఇంతవరకూ స్పందించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యార్థుల్లో సేవా ద కృథం కలిగి ఉండాలని ఎంపిడిఒ ఐవి లక్ష్మి అన్నారు. మండలంలోని జెకెపాడులో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా శిబిరంలో ఆమె పాల్గొన్నారు. చిన్నప్పటి నుంచే సేవాభావం కలిగి ఉంటే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా జాతికి అందుతారని అన్నారు. ఎన్ఎస్ఎస్ లాంటి సేవా సంస్థలు మీలో ఉన్న సేవభావం వెలికి తీసి మంచి అలవాట్లను కలిగి ఉండేలా తీర్చుదిద్దుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ రామయ్య, అధ్యాపకులు ఉన్నారు.

రైతు సేవా కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చిన్నబోగిలి, బూర్జ రైతు సేవా కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులులేకుండా చూడాలన్నారు. 17శాతం తేమ తక్కువ ఉన్న ధాన్యం తీసుకోరాదన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫెన్సింగ్ అండర్ -14 క్రీడలకు తిరుమల సాయి విద్యార్థి

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

ఫెన్సింగ్ అండర్ -14 స్కూల్ గేమ్స్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు జియమ్మ వలస మండలం పెదమేరంగి తిరుమల సాయి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి నిమ్మల జితేంద్ర ఎంపికయ్యాడు. విద్యార్థి ఎంపిక పట్ల పాఠశాల అడ్వైజర్ రౌతు వెంకట నాయుడు, కరస్పాండెంట్ సరళ కుమారి అభినందించారు. నెల్లూరు జిల్లా రైన్ బో ఉన్నత పాఠశాలలో ఈనెల 9 నుంచి 11 వరకు జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.


ఎంపికైన జితేంద్ర

ఏకలవ్య పాఠశాలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

2025 -26 విద్యా సంవత్సరానికి స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో తాత్కాలిక పోస్టులు నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కోరారు. పిజిటి ఫిజిక్స్‌కు ఎంఎస్‌సి, ఫిజిక్స్ బిఇడి, పిజిటి బయాలజీ పోస్ట్‌కు ఎంఎస్‌సి బయాలజీ, బిఇడి అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 11 ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, పాత్య ప్రణాళికతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.

పట్టణానికి చేరుకున్న అభ్యుదయం సైకిల్ యాత్ర

స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన అభ్యుదయం సైకిల్ యాత్ర బృందానికి, కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి స్వాగతం పలికారు. గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు నిర్వహించిన అభ్యుదయం సైకిల్ యాత్ర సోమవారం జిల్లాకు చేరుకుంది. ఈ సైకిల్ యాత్ర సీతానగరం మండలం, మరిపివలస ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల మీద అవగాహనా కల్పించి ముందుకు సాగుతూ నర్సిపురం చేరుకోగా, ర్యాలీగా వస్తున్న ఎఎస్పీ మనీషా రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజలు, ప్రజానాయకులు, యువత, విద్యార్థులు వారిని ఆహ్వానిస్తూ, అభ్యుదయం సైకిల్ యాత్రను మన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించాలనే సంకల్పంతో ఈ అభ్యుదయం సైకిల్ యాత్రను పోలీసు శాఖ నిర్వహించడం మంచి శుభ పరిణామమని అన్నారు. ఎస్పీ మాధవ్ రెడ్డి మాట్లాడుతూ అభ్యుదయం సైకిల్ యాత్రను విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపినాథ్ జట్టి సమాజంలో మార్పు కోసం ఒక ధృఢ సంకల్పంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని తెలిపారు. విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించి వారిలో చైతన్యం తీసుకొచ్చి డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్‌పి, జిల్లా అధికారులు పట్టణంలో సైకిల్ తొక్కుతూ ర్యాలీలో పాల్గొన్నారు. మార్గ మధ్యలో ప్రజలు పూలు చల్లుతూ, డ్రగ్స్‌పై నినాదాలు చేస్తూ, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. స్థానిక కాంప్లెక్స్ వద్ద సుమారు 3000 మంది పైగా విద్యార్థులు, ప్రజలు, యువతతో మానవహారంగా ఏర్పడి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీ కన్యకా పరమేశ్వరి గుడి వెనుక ఉన్న కల్యాణ మండపం లో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో పాల్గొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్. వైశాలి, పాలకొండ సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.


పట్టణంలో చేపట్టిన సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి

అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసిపి విమర్శలు : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన ప్రాంతాల్లో తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకే వైసిపి నాయకులు విమర్శలకు పాల్పడుతున్నారని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్ పాలనలో ఒక్క డిఎస్‌పి నోటిఫికేషన్ ఇవ్వకుండా గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పద మన్నారు. వైసిపి ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బకాయిలను తమ ప్రభుత్వం ఇస్తుంద న్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.107 కోట్లు, మెయింటెనెన్స్ రూ.28.40 కోట్లు, డైట్ ఛార్జీలు రూ.105 కోట్లుతో పాటు, 'నాడు-నేడు' పేరుతో కేవలం గోడలకు రంగులు వేసి, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా వదిలేసిన ఘనత వైసిపికే దక్కుతుందని విమర్శించారు. గిరిజన ప్రాంతాల్లో 66 మంది చిన్నారులు మరణించినప్పుడు జగన్ రెడ్డి ఒక్క బాధితుడి ఇంటికైనా వెళ్లారా? ఏదైనా బాధ్యత తీసుకున్నారా?" అని ప్రశ్నించారు. 'అమ్మ ఒడి' పథకాన్ని ఇద్దరికి ఇస్తానని చెప్పి చివరకు ఒక్కరికే పరిమితం చేసి వైసిపి ప్రజలను మోసగించిందని ఆరోపించారు. ఉద్భవ్-2025' జాతీయ వేడుకకు గిరిజన శాఖా మంత్రిగా తాను హాజరైతే వైసిపి నాయకులకు కడుపుమంట ఎందుకని మంత్రి ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే గిరిజన సంక్షేమం కోసం భారీగా నిధులు కేటాయించి పనులు చేపట్టిందని మంత్రి వెల్లడించారు. ఈ అభివృద్ధిని చూసి వైసిపి అసహనంతో లేనిపోని ఆరోపణలు, విమర్శలకు పాల్పడుతున్నారని అన్నారు. విలేకరుల సమావేశంలో సాలూరు పట్టణ, మండల, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాల టిడిపి అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తానని అన్నారు. ఐదు మండలాల్లోని ప్రజలు వచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు.

'ప్రకృతి' పద్ధతిలో దేశీయ వరి రకాలు సాగు

ప్రజాశక్తి - పాచిపెంట

ఎలాంటి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా పురాతన దేశీ వరి రకాలను ప్రకృతి సేద్యం చేయాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు సూచించారు. మండలంలోని పాంచాలిలో సిఆర్‌పి కర్రి శ్రీనివాసరావు ప్రకృతి సేద్యంతో సాగు చేస్తున్న వరి పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ భూమి రసాయన ఎరువులకు అలవాటు పడడం వల్ల పూర్తిగా రసాయన ఎరువులు వేయకపోతే పంట పండదన్న అపోహతో ఉన్న రైతులకు ఈ ప్రయోగం ఒక చక్కటి పరిష్కార మార్గమని అన్నారు. సిద్ధ సన్నాలు, ఢిల్లీ బాస్మతి, కుజు పటాలియా వంటి పురాతన రకాలను ఎలాంటి ఎరువులు వేయకుండా, పురుగుమందులు పిచికారీ చేయాల్సిన అవసరమే లేకుండా పండించినట్టు తెలిపారు. అనంతరం తాడూరులో రైతు మడక జగన్మోహన్‌రావు తన మామిడి వ్యవసాయ క్షేత్రంలో చేస్తున్న ప్రకృతి సేద్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు పురుగులు, తెగుళ్ల నివారణకు పేడ మూత్రం ఇంగువ ద్రావణం పుల్లటి మజ్జిగ తోటి కాడ కషాయం, అగ్నిస్త్రంను కలిపి పిచికారీ చేయడం ద్వారా పురుగులు తెగుళ్ల నివారణలో వాటి ప్రభావాన్ని పరిశీలించినట్టు తెలిపారు. మామిడి చెట్ల మధ్య ఉండే ఖాళీ స్థలంలో కూరగాయలు, వేరుశెనగ వంటి పంటలను పండించడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో సిఆర్పిలు తిరుపతి నాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు


కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కొమరాడ

గతంలో ఉన్న బస్సు సర్వీసులను నిలిపివేసిన నేపథ్యంలో ప్రయాణికులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తిరిగి పునరుద్ధించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. బస్సు సర్వీసులను పునరుద్ధించాలని కోరుతూ సోమవారం సిపిఎం కొమరాడలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నుంచి కూనేరు వరకు నైట్ హాల్ట్ బస్సుతోపాటు పార్వతీపురం నుండి కూనేరు మీదుగా, పూడేసు, లంజి గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో సుమారు ఒక పది గిరిజన గ్రామాలు ప్రజలతో పాటు మైదాన గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రి 7.15గంటలు దాటితే పార్వతీపురం నుండి కూనేరు, లంజి గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఆటోలకు అధిక మొత్తంలో డబ్బులు చెల్లించుకుని వచ్చే పరిస్థితి ఉందని అన్నారు. ఈ మార్గంలో బస్సులు వేయాలని కోరుతూ గతంలో ఇద్దరు కలెక్టర్లకు గ్రీవెన్స్‌లో వినతి పత్రం ఇచ్చామన్నారు. కనీసం స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పైన తెలిపిన విధంగా ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని, లేనిచో ఈనెల 21న కొమరాడలో ప్రజా సంఘాలు, వివిధ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం నాయకులు వెంకటేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు యమక గౌరు నాయుడు , రాము పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో రేగులపాడు, తూడి గ్రామాల మధ్య సోమవారం స్థానిక ఎస్సై జి. కళాధర్ ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అందుబాటులో ధ్రువ పత్రాలు ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.


లైసెన్స్‌లను పరిశీలిస్తున్న ఎస్ఐ కళాధర్



ఐకెపి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న విఒఎలు

విఒఎల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - మక్కువ

వెలుగులో పనిచేస్తున్న విఒఎలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వెలుగు ఉద్యోగుల సంఘం (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక వెలుగు కార్యాలయంలో విఒఎలతో జరిగిన సమావేశం సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.గంగునాయుడు, వెలుగు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు దేవి మాట్లాడారు. ప్రభుత్వం 5జి సిమ్‌లు, ఫోన్లు ఇవ్వకుండా ఆన్లైన్ పనులు చేయమనడంతో వెలుగు ఉద్యోగులు తీవ్ర పనిఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విఒఎలకు నేటికీ యూనిఫాం, ఐడి కార్డులు నేటికీ ఇవ్వలేదని, ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు. వెలుగు ఉద్యోగులకు ఇస్తున్న జీతాన్ని నేరుగా ఉద్యోగుల ఖాతాలకు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి, అర్హులైన విఒఎలను సిసిలుగా ప్రమోషన్ అవకాశం కల్పించాలని, కనీస వేతనాల చట్టాన్ని అమలు చేసి జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై పలుమార్లు ఆందోళనలు నిర్వహించి వినతి పత్రాలు ఇచ్చినా ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో ముందుకు రావడంలేదని అన్నారు. ఇప్పటికైనా వెంటనే వెలుగు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనిక ఓరారు. అలాగే ఈనెల 31 నుంచి జనవరి 4వరకు విశాఖలో జరిగే అఖిలభారత సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి - కురుపాం

విఆర్‌ఎలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తలపెట్టిన మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలో జిల్లాలోని విఆర్‌ఎలంతా పాల్గొని జయప్రదం చేయాలని విఆర్‌ఎల సంఘ జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహశీల్దార్ ఎ.సురేష్ కుమార్‌కు ముందస్తుగా అనుమతి పొందేందుకు విఆర్‌ఎలతో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విఆర్‌ఎలు ఎదుర్కొంటున్న వేతనాలు, సేవా నిబంధనలు, భద్రతా సమస్యలు వంటి అంశాలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు దశలవారీగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో విఆర్‌ఎ సంఘ మండల అధ్యక్షులు సరోజిని తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి టెట్

విజయనగరం: ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు టెట్ (టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి మురళి తెలిపారు. జిల్లాలో 5 కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షకు సుమారు 13,985 మంది హాజరు కానున్నారని తెలిపారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పక్కాగా ఏర్పాట్లు చేసి, టెట్ పరీక్షలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది మండలంలోని పలగరలో జాతీయ సేవా శిబిరం-1, బలిజిపేట గొల్లవీధిలో ఎన్ఎస్ఎస్-2 ఆధ్వర్యాన విద్యార్థులకు రక్తదానం, పరిసరాల పరిశుభ్రత, మానవతా విలువలు, జీవిత నడవడిక, క్రిమినల్ నేరస్తులు తదితర అంశాలపై అధ్యాపకులు బి.మురళీధర్, పి.వాసుబాబు, జగన్నాథం, రామారావు, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ పి.మాధవి హాజరయ్యారు

23,24న రాష్ట్రస్థాయి క్రీడా ఎంపికలు

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 23, 24 తేదీల్లో జాతీయ పీసా షెడ్యూల్ ప్రాంతాలకు సంబంధించి విస్తరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 23,24 తేదీల్లో విశాఖపట్నంలో రాష్ట్ర క్రీడల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ ఎన్.జాకబ్ దయానంద్ ప్రకటనలో తెలిపారు.

15న జిల్లా స్థాయిలో కోటి సంతకాల సేకరణ : వైసిపి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 15న జిల్లాస్థాయిలో తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. సోమవారం జోగారావు అధ్యక్షతన నియోజకవర్గ పార్టీ అధ్యక్షులు, జిల్లా, రాష్ట్ర, నియోజకవర్గ అనుబంధ విభాగాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధుల, సీనియర్ నాయకులతో కలిసి తన క్యాంప్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడానికి నిరసనగా వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి శ్రేణులకు ఇచ్చిన పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం కార్యక్రమం చేపట్టి ప్రతి నియోజకవర్గం నుంచి 60 వేల పైచిలుకు సంతకాలు సేకరణ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. ఈ మేరకు ఈనెల 10న నియోజకవర్గ స్థాయిలో, 15న జిల్లా స్థాయిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతం చేయాలని పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు వచ్చే ఈనెల 10న నియోజకవర్గ స్థాయిలో కోటి సంతకాలు చేసిన భారీ బైక్ ర్యాలీతో జిల్లా కేంద్రానికి తరలించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున నియోజకవర్గం పరిధిలో గల ప్రతి గ్రామం, వార్డు నుంచి వైసిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, ప్రధాన కార్యదర్శిలు పోల సత్యనారాయణ, తప్పిట ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష?, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, జడ్పీటీసీలు అలజంగి రవికుమార్, మామిడి బాబ్జీ, బలగ నాగేశ్వరరావు, వైఎస్ ఎంపీపీలు వెలిది సాయిరాం, బంకురి రవికుమార్, సిద్దా జగన్నాథం, రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి మరియు నియోజకవర్గ స్థాయి అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సర్పంచ్లు, ఎంపిటిసి సభ్యులు, కౌన్సిలర్ సభ్యులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: వైసిపి అధిష్టానం పిలుపు మేరకు నిర్వహించిన కోటి సంతకాల సేకరణ పూర్తయిన సందర్భంగా ఈనెల10న పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర చెప్పారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ సంతకాల సేకరణ పూర్తయిన తర్వాత జిల్లా కేంద్రానికి ప్రత్యేక వాహనం ద్వారా రవాణా చేయనున్నట్లు చెప్పారు. అఫీషియల్ కాలనీలో తన నివాసం నుంచి బోసుబొమ్మ జంక్షన్ వరకు చేపట్టనున్న ర్యాలీలో పాల్గొనడానికి పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు .అదే విధంగా ఈనెల 15న జిల్లా కేంద్రంలో నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన కోటి సంతకాల ఉద్యమం లో భాగస్వాములైన వారితో ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి కూడా అధిక సంఖ్యలో పార్టీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఎంపిపిలు హాజరు కావాలని రాజన్నదొర కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

చీపురుపల్లి: ఉచిత విద్య, ఉచిత వైద్యం వంటి ప్రజల హక్కులను కూటమి పాలకులు కాలరాస్తున్నారని వైసిపి నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలో మూడు రోడ్డుల కూడలిలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుమార్తె బొత్స అనూష సారథ్యంలో కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్యాంగ నిబంధనలు సైతం ఉల్లంఘిస్తూ కూటమి పాలకులు ప్రజల హక్కులను తుంగలో తొక్కుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనయుడు, మీసాల వరహాల నాయుడు, బెల్లాన వంశీకృష్ణ, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ధన్నాన జనార్ధన, బెల్లాన త్రినాథరావు, పతివాడ రాజారావు, అధికారుల శ్రీనుబాబు, రేవళ్ల సత్తిబాబు, బమ్మిడి కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాలు సేకరణ ఉద్యమంలా చేపట్టాలి

బొబ్బిలి: మెడికల్ కళాశాలలకు వ్యతిరేకంగా ఈనెల 10న చేపట్టనున్న కోటి సంతకాలు సేకరణను ఉద్యమంలా చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలన్నారు. కోటి సంతకాలు సేకరణను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు సావు మురళీ, ఇంటి గోపాలరావు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ ముగింపు ఉత్సవాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవా శిబిరం ముగింపు ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అధ్యక్షతన, ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ నిర్వహించిన ప్రత్యేక శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా సిఐ వియన్ మూర్తి మాట్లాడుతూ నేడు మన సమాజాన్ని మెల్లిగా కుదేలుచేస్తున్న సమస్యల్లో డ్రగ్స్ ఒకటి అని దానికి బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. డ్రగ్స్ వల్ల శరీరం బలహీనపడటం, చదువుపై దృష్టి లేకపోవడం, కుటుంబ సంబంధాలు దెబ్బతినడం, ఆర్థిక నష్టం ఇలా అనేక సమస్యలు వస్తాయన్నారు అనంతరం విద్యార్థులకు పెట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ పిఒ భాస్కర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు

ప్రజాశక్తి- రామభద్రపురం

స్థానిక మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు వేతన బకాయిలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని గత వారం రోజుల నుంచి చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని వీధుల్లో తిరుగుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. 4 నెలల నుంచి బకాయిలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇటీవల 3 నెలల జీతాలు ఇస్తామని పంచాయతీ అధికారి హామి ఇచ్చి అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.